# నిధి చాలసుఖమా?

'డ్రైవర్ డ్రైవర్' అంటూ కేకేసింది ఉమ, తనగదిలోనుంచే.

మరునిమిషం వసారాలో నుంచి పని మనిషి కాంతమ్మ గదిలోనికి వచ్చింది, 'అమ్మగారూ! పిలిచారా?' అంటూ.

'నిన్ను కాదు'

కాంతమ్మ నవ్వింది.

'డ్రైవర్ మేడమీద వుండాడండీ - ఏం చెప్పమంటారు? కారు సిద్ధం చేయమనేనా?'

-ఉమ ఆఖరుసారి అద్దంలో తన ప్రతిబింబాన్ని చూచుకుంది. కాంతమ్మ మాటలు విని ఆమె వంక తీక్షణంగా చూచింది. ఆఖరుకు పనిమనుషులు కూడా, తనకు జవాబు చెప్పుతున్నారు!

ఆమె కోపంగా చూడడంతో, కాంతమ్మకు లోపల లోపల కొద్దిగా భయం వేసినట్లయింది. బతిమాలుతున్నట్లుగా అనునయంగా 'యేం అమ్మగారూ! అతనికేం చెప్పమంటారు?' అంది.

'నాలుగేళ్ళ నుంచి పనిచేస్తున్నావన్నమాటే గాని నీకు బొత్తిగా ఇంగిత జ్ఞానం లేదు కాంతమ్మా' చాలా ఓపికపట్టి అంది ఉమ.

కాంతమ్మ ముఖం చేటంత అయింది. అమ్మగారి కోసం పోయిందన్నమాటేగా!

'నాకేం తెలుస్తుందండీ' అంది ముసిముసిగా నవ్వుతూ.

'కారు సిద్ధం చేయమని కాకపోతే డ్రైవర్‌తో నాకు రాచకార్యాలు ఏముంటాయి?' అంది ఉమ ఇంకా కోపంగా చూస్తూనే.

'ఆ మాట యిందాకనే అడిగాను కదండీ. నన్ను వెర్రిదాన్ని చేసి...'

"ఓసి వెర్రిదానా! ఆ మాట అడగాలంటే? కేక వినగానే చెప్పిరావద్దూ?" అంది ఉమ కుర్చీలో నుంచి లేచి నిలబడింది.

'చిటికలో చెప్పి వస్తానమ్మగారూ!' అంటూ కాంతమ్మ బయటకు పరుగుతీసింది.

ఉమ బల్లమీద పుస్తకం తీసి చేత పుచ్చుకుంది.

గడియారం వంక చూచింది.

సరిగ్గా నాలుగున్నర

ఇంతలో కాంతమ్మ మళ్లీ పైకి వచ్చింది.

'డ్రైవర్ లేడు అమ్మగారూ!'

'ఎక్కడకు వెళ్లేడట? కారు గారేజిలో వుందా లేదా?'

'ఉన్నదండి టీ తాగివస్తానని చెప్పి అరగంట క్రిందట వెళ్లాడట. వేగం లాక్కురమ్మని గురవయ్యను పరిగెత్తించాను లెండి ఈ పాటికి తిరిగి వస్తూనే వుంటాడు' అంది కాంతమ్మ యజమానురాలి పనిని తాను చాకచక్యంతో చేసినందుకు ఆమె మెచ్చుకుంటుందేమో! చూచి సంతోషిద్దామని.

'వెధవకు గంట గంటకూ టీ! సరిగ్గా సమయానికి ఉండడు. ఈ డ్రైవర్లందరికీ ఇదే జబ్బు' అంది ఉమ, దాదాపు అర్ధస్వగతంగా.

'డబ్బంతా టీ దుకాణానికే ఇస్తున్నట్లున్నాడండీ. ఇంటిదగ్గర పిల్లా జెల్లా' అంటూ మొదలెట్ట పోయింది కాంతమ్మ.

'చాల్లే ఊరుకో, నీ సోది కూడా ఇప్పుడేనా?'

'అది కాదు అమ్మగారూ!'

'ఏంటే!'

'వాడికిచ్చే నూటయాభయిలోనూ'

'వాడి గొడవ వద్దని చెప్పానా లేదా?'

'ఆ సంసారం...'

'అబ్బ– కాంతమ్మా, నువ్వు బయటకు వెళ్లు, వాడు వచ్చాడో లేదో చూడు'

'రాగానే గురవయ్యను పైకి వచ్చి చెప్పమన్నాను అమ్మగారూ!'

'అన్ని ఏర్పాట్లు చేసుకునే వచ్చావన్నమాట!'

'అయినా ఏంతొందరండీ అమ్మగారూ! అయ్య ఇంకా రాలేదుగా!'

'మీ అయ్య ఒకనాడయినా అన్న ప్రకారం వచ్చారుటే!'

'వారు రాకపోయినా మీరు వెడతారు గనుక వారికి విషయమే గుర్తుండదు అమ్మగారూ!'

ఉమ విసుగ్గా చేతిరుమాలుతో నుదురు తుడుచుకుంది. మళ్లీ కుర్చీలో కూలబడింది. పుస్తకం పుటలు విప్పి ఒక్కక్షణం పరికించింది.

'ఈ గురవయ్యగాడు కూడా ఆ టీ దుకాణంలోనే కూరుకుపోయినాడేమే!'

'పాపం, తీరా అక్కడకు వెళ్లిన తరువాత ఒక అరకప్పు పుచ్చుకుందామని కుతి అయిందేమో అమ్మగారూ!'

'ఏడిసినట్లే ఉన్నాయి వీళ్ల ఆటలు! అప్పుడే అయిదు గంటలయిపోయింది. నువ్వయినా వెళ్లి ఇద్దరినీ ఈడ్చుకురా".

కాంతమ్మకు మళ్లీ ఈ మారు తప్పలేదు.

ఎంత ఇష్టం లేకపోయినా ఆ విషయాన్ని ముఖంలో కనిపించనీయకుండా మెల్లగా బయటకు నడిచింది.

జూబిలీ క్లబ్బులో సాయంత్రం ఆరుగంటలకు గొప్ప పార్టీ జరగబోతోంది. దానికి సకాలంలో అందుకునేట్లు వెళదామని ఉమ తాపత్రయ పడుతోంది.

'ఇంకా అయిదేనా కాలేదుగా! ఓ పావుగంట సేపు వారి కోసం ఎదురుచూచి మరీ వెడతాను' అనుకుంది.

అబ్బ! ఎదురు చూడడం అంటే ఒకటే తలనెప్పి.

ఎంత సేపని ఎదురుచూడడం? ఎంతకాలమని ఇలా... ఎంతమంది కోసరం?

ఆయన ఇంకో పావుగంటకు ఇంటికి వచ్చినా చాలు. ఒక పది నిమిషాలలో అక్కడకు చేరుకుంటారు. అయిదు నిమిషాలు ముందుగానే చేరుకుంటారు. అతిథులందరినీ ముందుగానే పలుకరించవచ్చు. కొత్త వాళ్లను పరిచయం చేసుకోవచ్చు. ఏదీ, ఇంతకూ ఆయనగారు వస్తే గదా!

చెప్పిన టైముకు ఎప్పుడు వచ్చారు గనుక?

ఏదో పనులు, ఏవోసాకులు చెబుతారు! ఈ ప్రపంచాన్నంతా తామే భరిస్తున్నట్లు! యేలుతున్నట్లు చెబుతారు. అన్నీ నిజమేనేమో! ఎవరికి కావాలి? అన్న టైముకు రారు. అన్న ప్రకారం చేయరు. తను ముందుగా చెప్పిందంటే మరీ జాప్యం చేస్తారు. ఒట్టి బద్ధకం! కాదు, తమకు కావలసినవన్నీ టంచనుగా టైం ప్రకారం చేసుకోవడం లేదూ? తను చెప్పిన పనులు చేయడానికి ఆయనకు ఎక్కడ లేని బద్ధకం వచ్చేస్తుంది. ఎక్కడెక్కడి తొందరపనులు, తమ కోసమే కాచుకొని వుంటాయి. ఆయనకు ఆ ధ్యాస వుంటేగా అసలు!

ఎంత ముచ్చటగా జరుగుతుంది పార్టీ!

ఎందరెందరు స్నేహితులు వస్తారు!

అందరినీ మళ్లా ఎన్నాళ్లకో ఒక్కచోట ఒక్కమారుగా చూడడం జరిగేది!

అధికారం ఉన్నందుకు ఆలంబన చిక్కినందుకు ఏమిటి ఫలం, ఇటువంటి పార్టీలకు వెళ్లకపోతే!

ఏమిటో ఆయనకు ఈ ధ్యాసే ఉండదు.

చెప్పినా వినరు, పట్టించుకోరు...

కాంతమ్మ వచ్చింది.

'డ్రైవర్ వచ్చాడు అమ్మగారూ! కారు ఎవ్వరెడీగా వున్నదట రండీ' అంది.

ఉమ గడియారం వంక చూసింది. అప్పుడే అయిదున్నర అయింది.

బయలుదేరబోయి, ఉమ మళ్లీ ముఖం అదోలాపెట్టి 'ఇంకోపావుగంట ఆగి బయలు దేరుతాను' అంది.

కాంతమ్మ నవ్వింది.

ఉమ కోపంగా చూచింది.

పనిమనిషి! ఎందుకలా కోతిలా నవ్వుతుంది?

తనంటే చులకనా? కాదు! తిడితే ఏడుస్తుంది మళ్లీ.

దీన్ని సాగతీయలేక తలప్రాణం తోకకు వస్తుంది తరువాత; పోనీలే నవ్వనీ!

'అమ్మగారికి ఆత్రం జాస్తి. ఇందాకటినుంచి నా ప్రాణం తోడేశారా? తీరా కారు రెడీ అయ్యేటప్పటికీ ఇంకో పావుగంట అంటున్నారు' అంది కాంతమ్మ గోడకు జారగిలపడి కూర్చుంటూ.

'మీ అయ్యగారు వస్తారేమోనని చూస్తున్నానే'.

'మరి అంత తొందరపెడితిరి! పాపం, గురవయ్య టీ కప్పు సగంలోనే వదిలి లగెత్తుకు వచ్చాడు'.

'యేడవలేకపోయినాడు. ఏ పనీ చప్పున చేయడం చేతకాదు. వట్టి నిద్రమత్తు మనుష్యులు'

'అంతేనండి అమ్మగారూ! వాడికి చెప్పిన ఏ పనీ ఒకంతట పూర్తికాదు'

ఉమకు ఈ కబుర్లంటే విసుగు.

కాంతమ్మ వద్దన్నా చెబుతుంది.

'ఎవరూ వినకుండా వుంటేనే దానికి బోలెడన్ని కబుర్లు పుట్టుకు వస్తాయి. కోరి చెప్పించుకుంటే ఇంకా ఎన్ని చెప్పగలగుతుందో!'

ఉమ ఆలోచనలు మళ్లీ కదిలాయి

ఆయన ఈసరికన్నా బయలుదేరి వుంటారా?

సగం దారిలో వుంటే చాలు... మరో అయిదారు నిమిషాలలో ఇంటికి వచ్చేస్తారు. అవును... తాను కాసేపు వేచి వుండడం మంచిపనే చేసింది. ఇద్దరూ కలిసి చక్కగా వెళ్లి రావచ్చును. ఆయన కూడా వుంటే తనకెంత హాయి! పరాయి చోటుకు వెళ్తే పలుకరించే వాళ్ళు ఉన్నా, లేకపోయినా ఆయన పక్కన వుంటే తనకు ప్రాపంచికమయిన విషయాలేమీ పట్టవు అవన్నీ ఆయనే చూచుకుంటారు. తను ముచ్చట్లు చెప్పుకుంటూ ఊహాలోకంలో ఆనందంగా హాయిగా తేలిపోవచ్చును. ఏరీ! ఇంకా రాలేదే! ఇంకేం వస్తారు? పుణ్యకాలం కాస్తా పూర్తయిపోతూ ఉంటేనూ?

అబ్బబ్బ! ఈ మనిషితో ఇదే చిరాకు.

ఉమ ఇలా ఆలోచనలతో సతమతం అయిపోతూ ఉండగా కింద కారు హారన్ మోగింది.

'ఎవరో వచ్చారు అమ్మగారూ!' అంది కాంతమ్మ.

'ఎవరో చూచిరా'.

కాంతమ్మ బాల్కనీ వైపు వెళ్లి కిందకు చూచింది.

'మీ స్నేహితురాలు -ఇందిరమ్మగారు వస్తున్నారండీ!' అని ఉత్సాహంగా చెప్పింది.

'ఇందిరా! గుడ్...' అనుకుంది ఉమ. ఇంతలో ఇందిర మేడపైకి రానే వచ్చింది. ఉమ గుమ్మంవరకూ వెళ్లి స్నేహితురాలికి స్వాగతం ఇచ్చింది.

'రా... ఇందిరా ... రా... సమయానికి దేవతలా వచ్చావు'.

'అదేమిటి ఉమా? ఏమిటా శుభసమయం?'

'నువ్వు రావడం కంటే శుభం ఇంకేం ఉందమ్మా!!' అని ఉమ కాంతమ్మతో 'కిందికి వెళ్లి వంటమనిషి నడిగి రెండు కప్పులు కాఫీ పట్టుకురా' అంది.

'ఇప్పుడెందుకు ఉమా, నేను ఇంటిదగ్గర తీసుకునే బయలుదేరాను. ఏమిటి, ఎక్కడికో వెళ్లటానికి తయారయినట్లున్నావే ఏం విశేషం?'

ఈ మాటలతో ప్రసక్తి లేకుండానే కాంతమ్మ కిందకు వెళ్ళింది కాఫీ తీసుకు రావటానికి.

'ఇవాళ జూబిలీ క్లబ్బులో గొప్ప విందు ఇందిరా! మహారాష్ట్ర దేశం నుంచి ఎవరో పెద్ద చిత్రకారుడు వచ్చాడట! ఆయన గౌరవార్థం అక్కడకు వెడదామని తయారయి ఆయనకోసం ఎదురుచూస్తున్నాను'

'అలాగా!శ్రీవారికోసం ఎదురుచూస్తూ ఉండగా పానకంలో పుడకలాగా నేను తారసిల్లానన్నమాట!'

'పో, ఇందిరా! నీ పోచుకోలు మాటలు పోనిచ్చావు గాదు' అంది, ఉమ కాస్త, సిగ్గుపడ్డట్టు అభినయిస్తే బాగుంటుందని ప్రయత్నం చేస్తూ.

'అలాకాదు, నిజం చెప్పు'

'ఏమిటి?'

'ఈ పళంగా మీ శ్రీవారు వస్తే నన్ను అర్థాంతరంగా వదిలేసి క్లబ్బుకు వెళతావా లేదా?'

'వస్తే-గిస్తే... వారి సంగతి నాకు తెలియదు గనుక అలా అంటున్నావు. నాతో పాటు క్లబ్బులకు, కాలక్షేపాలకు వస్తారనేనా నీ ఉద్దేశ్యం?'

'నా ఉద్దేశ్యం అలా ఉంచు. ముందు నీ మాట చెప్పు'.

–కాంతమ్మ ట్రేతో సహా వచ్చింది.

ఇందిర కాఫీ కప్పు అందుకుంటూ 'పాపం మీ వారికోసం ఉంచిన కాఫీ నా పాలిట పడింది పోనీ యేం చేస్తాం, చేసుకున్నవారికి చేసుకున్నంత మహదేవ అన్నారు' అంది.

కాఫీ తాగడం పూర్తిచేసి ఉమ 'యేం గాలివానలా వచ్చావు ఇందిరా, ఏమిటి విశేషాలు' అంది.

'యేమీలేవు. చాలకాలం అయింది గదాని నిన్ను చూచిపోదామని వచ్చాను'.

'పాపం! ఎంత ప్రేమ!'

'పోనీ అలాగే అనుకోవే! నిజం చెబితే ఈ రోజులలో ఎవరికీ నమ్మబుద్ధి కాదు' అంది ఇందిర.

'అబ్బ! హరిశ్చంద్రుడి చెల్లెలు...! సరేగాని? వారు వచ్చేట్లు లేదు, టైమయి పోతోంది పోదాంపద'.

'పద – నిన్ను క్లబ్బుదగ్గర డ్రాప్ చేసి నేను ఇంటికి వెడతాను'.

'అలా నిన్ను వెళ్లనీయకేం. నాతోపాటు నువ్వూ క్లబ్బుకు రావాలి!'

'వద్దు ఉమా! నాకు పరిచయం లేని మనుష్యుల మధ్య నేనెందుకు నాకు ఇష్టం ఉండదు'.

'పరిచయానికేముంది? ఇప్పుడు చేసుకుంటే పోలా? నాతోరా, నీ పిరికితనం వదలగొడతాను'.

'అలా కాదు. నేను ఇవాళ రానులే. మరో రోజు చేసుకుందాం'.

'ఏం, ఇవాళ ఏదయినా దుర్ముహూర్తం వుందా? లేక మీ వారితో ఏదయినా ప్రోగ్రాం వేసుకున్నావా?'

'ఉహు మావారు ఊళ్లో లేరు. పనిమీద మదరాస్ వెళ్లారు. ఎల్లుండికిగాని రారు'

'అయితే ఇంకేం – నువ్వు తప్పకుండా రావల్సిందే! అందరికీ నిన్ను పరిచయం చేస్తాను పద'.

ఇందిర తనకు రావడం కుదరదని ఎంత వాదించినా ఉమ వినేటట్టు లేదు. ఏమంటే రాకపోవటానికి ఇందిరకూ గొప్ప కారణాలు లేవు. తనకు తెలియని వాళ్ళతో విందు ఎందుకని ఆమె బాధ. ఒకసారి తెలుసుకుంటే తెలియనివాళ్లు మిగలకుండా పోతారని ఉమ పూచీ.

'అయినా ఇలాంటి సోషల్ గాదరింగ్స్ అంటే నువ్వు ఎందుకు అలా నీరసంగా వుండిపోతావు ఇందిరా? నీ చలాకీతనం అంతా ఏమయిపోతోంది నలుగురిలోకి

వస్తే! మన ఎడ్యుకేషన్‌కీ, మన కల్చర్‌కీ నలుగురితో కలిసి తిరక్కపోతే, మెలక్కపోతే ఎందుకింకా ఈ అడవి జీవితం? రోజల్లా ఇంట్లో పడి కూచుంటే ఎట్లా తోస్తుంది గనుక? మన సోషల్ స్టేటస్‌కు ఊళ్లో పెద్దలందరితోనూ పరిచయం లేకపోతే రాణింపు ఏముంది? కూపస్థ మండూకం లాగ ఒకచోట పడివుండటానికా మనకు ఈ సిరిసంపదలు, భోగభాగ్యాలు, ఎందుకు ఇచ్చాడంటావు భగవంతుడు?' అంటూ ఉమ ఇందిరకు ధైర్యం చెప్పి ప్రయాణం చేయించింది.

'కాంతమ్మ – డ్రయివర్‌ను కారు బయటకు తీసుకురమ్మను'

'మళ్లీ నీ కారు ఎందుకు ఉమా! నేను కారులోనే వచ్చాగా! దాన్లోనే వెడదాం' అంది ఇందిరా.

'తిరిగి వచ్చేటప్పుడు డ్రైవర్‌ను కారు తీసుకురమ్మంటాను'

'ఎందుకు లెద్దూ, ఒక గంటసేపట్లో తిరిగి వచ్చేస్తామంటున్నావుగా! నా కారులోనే నిన్ను దింపి వెడతానులే. మళ్లీ మీ వారికి కారు కావలసి వస్తుందేమో?'

'వారికి కావాలంటే ఆఫీసు కారు ఉందిలే'.

'రాద్దూ నా కారులో వెడదాం' అంటూ ఇందిర ఉమను కిందకు లాక్కువెళ్లింది.

ఇద్దరూ కారు దగ్గరకు పరిగెత్తారు.

ఇందిర డ్రైవర్ సీట్లో కూర్చుంది.

ఉమ ఆమె సరసనే కూర్చుంది.

కాంతమ్మ అమ్మగారి దగ్గర సెలవు తీసుకుని తిరిగి ఇంటిలోకి వచ్చింది. గురవయ్య తోటకు నీళ్లు పడుతున్నాడు. డ్రైవర్ కారు గారేజీలో పెట్టేసి తాళం వేసుకుని మళ్లీ టీ దుకాణం వైపు వెళ్లిపోయాడు.

✧ ✧ ✧

'మీ శ్రీవారు సరాసరి క్లబ్బుకే వస్తానన్నారా?' అనడిగింది ఇందిర.

'బహుశా రారనుకుంటాను. వస్తే ఇంటికే వస్తానన్నారు. అందుకనే ఇంత సేపు ఎదురు చూచాను. వారికి ఇలాంటి ఫంక్షన్స్ అంటే అట్టే ఆసక్తి లేదు'.

'నీ కోసమన్నా ఆసక్తి కలిగించుకోవద్దూ?'

'నా కోసమా?... అవును... నా కోసం...' అంటూ ఉమ ఆలోచనలలో మునిగిపోయింది.

రెండు క్షణాలు ఊరుకుని ఇందిర మళ్లీ అడిగింది. 'యేం, ఉమా! అంత ఆలోచనలో పడిపోయావ్? ఇదంతా ఆయనగారు రానందుకు విచారమే!'

'ఏమిటి ఇందిరా, చిన్నపిల్లలా చిలిపి మాటలు'

'పోనీ కాదని చెప్పరాదూ?'

'అయితేనేం-కాకపోతేనేం- నీకెందుకు?'

'అంతకోపం అయితే ఆ ప్రసక్తి తీసుకురానులే'

'అదికాదే ఇందిరా! ఆయనగారు చూచావా? అన్న ప్రకారం రానయినాలేదు'.

'ఏదన్న పనివుండి ఆగిపోయారేమో!'

'అదే నేననేది! వారికి నా కంటే తతిమ్మా అన్ని పనులూ ముఖ్యం'.

'ఛ! అదేమిటి? అంత నెర్వస్‌గా మాట్లాడుతున్నావు! అయినా ఆయనగారు తప్పకుండా వస్తానన్నారా?'

'అనలేదనుకో అయినా రావద్దూ?'

'బాగుంది! అసలేమన్నారు చెప్పు'

'రావడానికి ప్రయత్నిస్తాను. బహుశా కుదరదనుకుంటాను. ఏ మాత్రం వీలు దొర్కినా వస్తాను. నేను ఒకవేళ రాలేకపోయినట్లయితే నువ్వు డ్రైవర్‌ను తీసుకొని మన కారులో వెళ్లు అన్నారు'

'ఇంకేం మరి! ముందే చెప్పారుగా'

'ఇది గ్రామఫోన్ ప్లేట్. ఏ సోషల్ ఫంక్షన్‌కు వెళ్లవలసినా ఈ పాటే వేస్తారు. ఆఖరుకు సినిమాకయినా అంతే!'

'వారికి తీరదేమో మరి! పెద్ద ఉద్యోగం కదా!'

'ఒక్కరేనా ఏం ఉద్యోగం చేస్తున్నదీ! ప్రపంచంలో తతిమ్మావాళ్లంతా వాళ్ళవాళ్ల స్వంతపనులు చూచుకోకుండా అస్తమానం ఆఫీసుకు అంటుకుపోయి కూర్చుంటున్నారా?'

'అయితే వారికి ఇలాంటివి ఇష్టం లేవేమో?'

'నీకు తెలియదు- చెవికోసుకుంటారు! తీరదట, తీరదు! ఆఫీసులో ప్రణాళికలు వేయడంతోటే ఆయన టైమంతా ఖర్చయిపోతుంది. ఇంక నా కోసం బజారు కేంవస్తారు?'

'పోనీలే నువ్వు ఒక్కదానివే వెళ్లగలవుగా!'

'వారు పక్కనుంటే వచ్చే హుందాతనం, నాకు వంటరిగా ఎలావస్తుందే! వారిని చూచేగా నాకు ఈ సోషల్ స్టేటస్! ఇదంతా నా స్వంతమా యేం?'

'పోనీ వెళ్లడం మానివేయరాదూ?'

'అదే నీ తెలివితక్కువ. వెళ్లకపోతే మన ప్రెస్టేజ్‌కు భంగం కదూ? రేపు ఎవళ్లయిన మనని మనుషుల్లా చూడాలా అక్కర్లేదా?'

'ఆ! చూడకేం చేస్తారు లెద్దూ, వాళ్లకోసం మనం బతుకుతున్నామా?'

'నీకు అర్థం కావులే ఈ బాధలన్నీ, అనుభవిస్తున్నదాన్ని నాకు తెలుసా నీకు తెలుసా?'

'అర్థం కాకపోతే పోనీ, మరేదయినా సంగతి చెప్పు'

-వాళ్లిద్దరూ ఇలా ఊసులాడుకుంటూ వెళ్లేసరికి గమ్యస్థానం రానేవచ్చింది.

క్లబ్బు ముందు కారు ఆగింది.

ఉమ ముందు కిందకు దిగింది.

ఇందిర కారును ఆవరణలో పార్క్ చేసి ఉమను కలుసుకుంది. ఇద్దరూ లోపలి హాలులోనికి వెళ్లారు.

'రండి- రండి'

అప్పుడే హాల్లో జనం నిండిపోయినారు.

'ఆలస్యం అయింది క్షమించండి' అంది ఉమ, అందరిలో కొందరి నుద్దేశించి.

'లేదు-లేదు, ఆలస్యం కాలేదు'

'అయినా నువ్వు కూడా ఇంత ఆలస్యం చేయడం... యేం బాగుంది?'

'ఎప్పటిలాగ మీ శ్రీవారు రానేలేదా?'

'మనకు ఎవరో కొత్త మెంబర్ను తీసుకువచ్చేవే!'

'ఈ జార్జెట్ చీర మీ వంటికి బాగా నప్పుతుంది'

'మీరు రాకపోతే ఇంతవరకు సభకు నిండే ఏర్పడలేదు'.

ఇలా తెలిసినవ్వాందరూ ఒకరుచేయని పరామర్శ మరొకళ్లు చేస్తున్నారు.

అందరికీ సమయోచితంగా జవాబులు చెప్పి ఉమ తనకోసం నిర్దేశించిన స్థానంలో కూర్చుంది. ఇందిర ఏమీ మాట్లాడకుండా ఆమెనే అంటిపెట్టుకుంది.

ఇంకా కొందరు ప్రముఖులు రావాలట. వాళ్లకోసం వేచివున్నారు. సభా ప్రారంభానికి కొద్దికాలం ఆలస్యం ఉంది. ఎక్కడికి వెళ్లినా ఎవరిని చూచినా వేచివుండటం తోటే కాలం కాస్త హరించిపోతోంది. ఒకళ్లకోసం ఎదురు చూడడంతోనే జీవితకాలంలో ఎక్కువకాలం వినియోగం అయిపోతోంది. ఒక్కొక్కసారి జీవిత కాలమంతా ఎదురుచూడడంతోటే సరిపోతుంది. ఇలా చూసుకుంటూ పోతే జీవితకాలం కూడా చాలక పోవచ్చును. ఉమకు ఇవన్నీ తలుచుకుంటే, ఎదురుచూడడం అనేది తనకొక్కదానికే కాదు- ప్రపంచానికంతటికీ వున్న సమస్యలా గోచరించసాగింది. అయినా తన విషయం ప్రత్యేకం. ప్రతిసారీ ఎదురుచూడడమే! దేనికోసం? నిరాశా నిస్పృహల కోసమే గదూ!

నిష్కారణంగా తన శక్తినంతా ఎదురు చూడడం కింద వృధాచేసేస్తోంది. చివరకు తన ఆలోచనలు- తను మిగిలేటట్లు ఎదురు చూడడం తనకు జీవితంలో పరిపాటి అయిపోయింది. అంతే!

ఉమ-ఇందిరకు అక్కడ చేరిన పెద్దవాళ్లందరిని గురించీ చెప్పింది. తనకు బాగా పరిచయం ఉన్నవాళ్లతో ప్రత్యక్షంగా పరిచయం కూడా చేయించింది.

అందరూ గొప్పగొప్ప ఉద్యోగస్తులు; ప్రైవేట్ కంపెనీల భాగస్వాములు, జమీందారులు, శ్రీమంతులు...!

ప్రభుత్వాన్ని నడిపించే వాళ్ళంతా ఇక్కడే ఉన్నారు.

డైరెక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, డాక్టర్లు... ప్రముఖులను ఎవరిని కలుసుకోవాలన్నా, సరాసరి ఇక్కడకు వచ్చేస్తే సరిపోతుంది - అనిపించింది ఇందిరకు.

ఇప్పుడు ఇందిరకు-ఉమ ఇందాకటి నుంచి పడిన మానసిక వేదన అర్థం కావచ్చింది. అవును మరి!

ఉమ భర్త ప్రసాద్ కూడా గొప్ప ఇంజనీయరు కదా!

ఇక్కడున్న వాళ్లతో సమ ఉజ్జీగా - ఒక మెట్టు ఎక్కువగానే కూర్చోవటానికి అర్హత, అవకాశం, అధికారం ఉన్నవాడే కదా! అందుకనే అతను రానందుకు ఉమ అంతగా పరితపించింది - అనుకుంది ఇందిర.

విందుకు వచ్చినవాళ్లలో చాలామంది ఉమను 'మీ వారు ఏరీ?' అనడగడం కూడా గమనించింది ఇందిర.

కొందరు 'ఊళ్లో లేరా? ఎటయినా ఇన్స్పెక్షన్‌కు వెళ్లారా? ఎందుకు రాలేదు?' అని గుచ్చి గుచ్చి అడిగినప్పుడు ఉమ అభిమానంతో ముఖం కిందకు దించుకుని

ఏదో జవాబుగా సణుగుతుంది. ఏం జవాబు చెప్పాలో ఆమెకు అర్థం కాదు. వాళ్లకేం చెబుతుంది? 'వారు రాలేదు' అన్నది ఇంతవరకు వివాదాంశం కాని సత్యం.

కాని ఎందుకు రాలేదు అన్న ప్రశ్నకు సరయిన సమాధానం తనకేం తెలుసును?

ఏం తెలుసునని తను వాళ్లకు సమాధానం చెబుతుంది.

ఏదో జవాబు చెప్పాలి గనుక చెప్పడం అంతే!

పాపం ఉమ పడిన అవస్థ చూస్తోంటే ఇందిరకు చాలా జాలేసింది. ప్రసాద్ ఆమెను చాలా బాధ పెట్టినట్లే లెక్క - అనుకుంది ఇందిర. మళ్లీ వివేకం తెచ్చుకుని, ఒక తరపు వాదనే విని తీర్పు చెబుతున్నట్లు గమనింపు పొందింది. ఏమో? అతను ఎందుచేత రాలేకపోయినాడో? వేరే ఏదో పెద్ద పని వుంటే తప్ప-ఎవరేనా విదేశీ ఇంజనీర్లను కలుసుకోవడమో- లేక పెద్ద ప్రాజెక్టుకు డిజైన్లు వేయడమో- ఏమంత్రుల సమాలోచనలలో పాల్గొనడమో- చేస్తూ ఉండి ఉంటాడు. నిజానికి ఆ పనులన్నీ ఈ పార్టీ కంటే గొప్పవే గదా, అయినా అదంతా అతని మనస్సుకు. అవేవీ ఊహించలేని ఉమకు కాదు అనుకుంది ఇందిర.

ముందు దిగులుగా కూర్చున్న ఉమ వాళ్లు వీళ్లు వచ్చి ఏవేవో మాటలలోనికి దింపడంతో ఆ హడావుడిలో పడిపోయింది. ఇందిర ఇదంతా గమనిస్తూ ఉన్నది గాని ఆమె మనసు మటుకు ఇక్కడ లేదు. ఉమను గురించే ఆమె ఆలోచనలన్నీని.

విందును చక్కగా 'ఎంజాయ్' చేస్తోంది ఉమ, కాని, ఈ సంతోషం అట్టడుగున 'వారు తన సరసన లేకపోయినారే' అన్న సంతాపం ముసుగు వేసుకుని ఉండనే వుంది!

క్రమంగా ఇష్టాగోష్ఠి కబుర్లన్నీ అయిపోయినాయి.

సమావేశం ప్రారంభం అయింది.

నలుగురయిదుగురు ముఖ్యఅతిథిని గురించి మాట్లాడారు. ఆయన కళానైపుణ్యాన్ని గురించి, వైవిధ్యాన్ని గురించి ప్రస్తావించారు. తరువాత ఆ చిత్రకారుడు ఉచితరీతిని సమాధానం చెప్పాడు. తన చిత్ర రచనకు ఆలంబన అంతా ప్రకృతే నన్నాడు. తనకు చిత్రకారుడుగా ఏమన్నా ప్రఖ్యాతి ఉంటే (ఉన్నదని అతనికీ తెలుసును) అదంతా ప్రకృతి కటాక్షమే అన్నాడు. తగినంత ప్రోత్సాహం, బలంవుంటే తన విద్యను విస్తృతం చేసుకుని మరింత కళాసేవ చేస్తానన్నాడు. తన కళామయ జీవితం సార్థకం చేసుకుంటానన్నాడు.

అందరూ చప్పట్లు చరిచారు.

కార్యక్రమమంతా హుషారుగా చకచక నడిచిపోయింది.

అంతా పూర్తయ్యేసరికి ఏడున్నర అయింది.

అందరి దగ్గరా సెలవు తీసుకుని వాళ్లిద్దరూ ఇంటికి బయలుదేరారు.

'ఎలా వుంది ఇందిరా?' అనడిగింది ఉమ.

'ఏమిటి? నిజంగానే ఇందిరకు ఆ ప్రశ్న అర్థం కాలేదు.

'అదే ఈ సంరంభం'

'బ్రహ్మాండంగా వుంది. కాని ఓ పెద్దలోపం!'

'ఏమిటో?'

'మీ శ్రీవారు రాకపోవడం'.

'అంతే కదా!'

–ఆ ప్రసంగం అక్కడితో ఆగిపోతే సరిపోయేది, కాని మళ్లీ ఇందిరే ప్రారంభించింది.

'ఇంతకూ మీ వారు రాకపోవటానికి ఏదో బలమైన కారణం ఉండి వుంటుంది ఉమా! లేకపోతే ఇంత గ్రాండ్ రిసెప్షన్‌ను మిస్ అవరు'

'ఈ కారణాలు విని విని నా చెవులు చిల్లులుపడిపోయినాయి. అంతే ననుకో'

'ఆ స్థితిలో నిన్ను చూస్తే నాకు చాలా జాలేసింది సుమా!'

'థ్యాంక్స్! అలవాటు అయిపోయినా నాకు బాధపడడం మాత్రం తప్పడం లేదు'.

'వారికి అంతగా తీరుబడి దొరకనప్పుడు ఏం చేస్తాంలే'

'అక్కడే నేను ఒప్పుకోను...'

'తీరిక దొరకడం అంటే అది ఎవరిచేతిలో పనంటావు? కావాలంటే దొరుకుతుంది, లేకపోతే లేదు. ఇంతకూ వారికి నాతోపాటు రావడం ఇష్టంలేదేమో? అంతే అనుకుంటాను నేను. ఇంకేం చెప్పినా నమ్మను'.

'చాలా పరుషంగా మాట్లాడుతున్నావు! నీతో రావడం వారికి ఇష్టం లేకుండా వుంటుందా?'

'ఏమో, నేను ఊహించలేను'.

'మరి ఎందుకు రారు?"

'అది వారినే అడగాలి!'

'అడిగాను. ఒకమారు కాదు లక్షమార్లు. ఒక్కటే జవాబు! తీరికలేదు అని. క్షణం వృధాగా గడపరట! ఎంతసేపూ వృత్తిధర్మమే సర్వమూ అంటారు'.

'అలాగా! ఈ పార్టీలకు వచ్చి సమయం వృధాపుచ్చడం కంటె వారు ఈ కాస్సేపు ఏదో ఉద్యోగ సంబంధమయిన పనులే చేస్తూ ఉంటారన్నమాట! అవును ఉమా! వృత్తిధర్మాన్ని శిరోధార్యంగా తీసుకున్న వాళ్లు ఒక్కక్షణం కాళీగా కూర్చోలేరు'.

'దానికైనా విధి విరామం ఉండవద్దుటే. మనసుకు కాస్త రిఫ్రెష్‌మెంట్ ఉండాలంటవా వద్దా?'

'ఆ విషయం వారికి తెలియదంటావా? అయితే ఈ రిఫ్రెష్‌మెంట్ అందరికీ ఒకేలాగ దొరుకుతుందా? ఎవరెవరి మనఃస్థితిని బట్టి వాళ్లకు'

'నువ్వు లక్షచెప్పు, కోటి చెప్పు, ఒక్కటే నిజం. మనసు విప్పి నీతో చెబుతున్నాను. వారికి నేనంటే లక్ష్యంలేదు. నా కోసం ఒక్కక్షణం అయినా కులాసాగా గడపలేరు. నన్ను ఒంటరిగా వదిలేసి తను వ్యాపృతులలో మునిగిపోతారు. నాకు ఈ ఏకాంతమే చెఱ అవుతుంది!' అంది ఉమ.

ఆమె కంఠం గాద్గదికం అయింది.

ఇందిరకు పరిస్థితి అర్థం అయింది.

కాని తను ఇంకేం మాట్లాడాలో అర్థం కాలేదు.

ఏమని, ఎట్లా మాట్లాడి ఉమను అనునయించడం?

ఆమె చాల ధారుణంగా ఊహించుకుంటోంది భర్తను గురించి. అందుకు ఆమెకు బలమయిన కారణాలు కూడా వున్నాయి. వాతావరణం బలంగా ఉంది. కాని అతను మటుకు – ప్రసాద్ ఇవేవీ లెక్క చేయకుండా తిరుగుతాడు కావున్ను! తన ఉద్యోగం ఏమిటో తను ఏమిటో తప్ప ఈ గొడవలన్నీ పట్టించుకోడు కావున్ను! అతని వృత్తికి వ్యావృత్తికి అదే సమంజసం అయివుండవచ్చును. కాని ఉమ పాపం వెర్రిగా ఆలోచనలలో పడిపోయి మరోలా భావించుకొంటోంది గదా! జీవితంలో నైరాశ్యాన్ని పెంచుకొని మానసికంగా కుంగిపోతోంది.

కారు ఉమ ఇంటి ముందు ఆపింది.

ఉమ దిగి 'రా ఇందిరా. కాసేపు కూర్చొని వెళుదువుగాని' అంది.

ఆమె ఆలోచనలలో నుంచి తేరుకుని 'కాదు. వెళ్లాలిలేవే రేపు వస్తాను' అంది.

ఉమ అంతగా బలవంతం చేయలేదు.

ఇందిర కారు నడుపుకుంటూ ముందుకు వెళ్లిపోయింది.

ఉమ ఇంటిలోనికి నడిచింది.

కాంతమ్మ ఎదురయింది.

'తొందరగా వచ్చేశారే అమ్మగారు' అని పలకరించింది.

'ఇంకా వారు రాలేదా కాంతమ్మా'.

'రాలేదండీ'.

ఉమ సరాసరి మేడమీదకు వెళ్లింది. తన గదిలోకి వెళ్లి సోఫాలో వాలిపోయింది. వారింకా ఇంటికి రాలేదు, విందు సంగతి మరచిపోతే పోయినారు, ఇంటి సంగతి కూడా మరచారా ఏమిటి? ఉమకు చాల నీరసం అనిపించింది.

కాంతమ్మ గదిలోకి వచ్చింది.

'అమ్మగారూ రేడియో పెట్టమంటారా?'

'ఊఁ'

ఏదో సంగీతం, వెల్లువలా వస్తోంది రేడియోలోంచి.

ఉమ యాంత్రికంగా వింటోంది.

ఆమె మనస్సు మాత్రం అక్కడ లేదు. సంగీతాన్ని గురించీ, దాని మాధుర్యాన్ని గురించి ఆలోచించే స్థిమితం లేదు.

కాంతమ్మ అటూ ఇటూ తిరిగి బయటకు వెళ్లిపోయింది.

ఉమ దుస్తులయినా మార్చుకోలేదు.

ఆమె ఆలోచనలన్నీ భర్తను గురించే.

వారింకా ఇంటికి రాలేదేమని! తనను ఇలా అలక్ష్యం చేస్తూంటే ఇకముందు తనయినా యేం చేస్తే బాగుంటుంది అని ఆలోచిస్తోంది.

తను కాపురానికి వచ్చింది లగాయితు ఈనాటి వరకూ తన దాంపత్యం ఎలా గడిచింది? ఎక్కడ ఎన్ని మలుపులు తిరిగిందీ స్ఫురణకు తెచ్చుకుంది.

ఆమె ఇలా ఆలోచించుకుంటూ ఉండగానే కాంతమ్మ మళ్లీ గదిలోకి వచ్చింది.

'అమ్మగారూ! వంట మనిషి వెళ్లిపోతానంటోంది భోజనానికి లేస్తారా?'

–ఉమకు ఎక్కడినించో కిందకు పడిపోయినట్లు అనిపించింది. మనసు ఒక్కమారుగా ఉలిక్కిపడింది.

ఏమిటి?... అన్నట్లు కాంతమ్మ వంక చూసింది.

కాంతమ్మ ఇందాక చెప్పిన మాటలనే మరింత సున్నితంగా చెప్పింది.

'టైం ఎంతయింది?' అంది ఉమ గడియారం వంక తను కూడా చూస్తూనే.

'ఎనిమిదిన్నర! అబ్బ - గంట సేపు ఒక్కర్తినీ ఇక్కడ దిగాలుగా వంటరిగా కూర్చున్నానా? ఏం చేస్తున్నాను, ఇందాకటి నుంచి- వంటరిగా ఆలోచించుకుంటూ కూర్చుంటే వెర్రెత్తిపోతుంది. చివరకు తన మనస్సు కూడా శరీరం మల్లేనే యాంత్రికంగా లాంఛన ప్రాయంగా తయారవుతోంది.

అవును! ఎనిమిదిన్నర అయింది.

వంటమనిషి డ్యూటీ అరగంట కిందట అయిపోయింది; లెక్క ప్రకారం కాని మంచిది. తన కోసం గౌరవం కొద్దీ అరగంట ఓపిక పట్టి కూర్చుండిపోయిం దన్నమాట.

'అయ్యగారు ఇంకా రాలేదుగా!...

'వంటమనిషిని వెళ్లిపొమ్మను, నేనూ తరువాతనే భోంచేస్తానులే'.

కాంతమ్మకు ఇంతకంటె కొత్త జవాబు రాదని తెలుసు. అందుకు తల వంచుకుని నిమ్మళంగా వెళ్లిపోయింది.

ఉమ సోఫాలో నుంచి లేచింది.

కాస్సేపు గదిలో అటూ ఇటూ తిరుగాడింది. ఏం చేయాలో తోచడంలేదు. ఏం చేయవలసిందీ కనిపించలేదు.

ఆయన ఇప్పుడే కాకపోయినా ఇంకో అరగంటకో, గంటకో రానే వస్తారు. రాగానే స్నానం చేస్తారు. తరువాత భోజనం అనంతరం నిద్ర.

దైనందిన కార్యక్రమంలో ఏమీ లోటు ఉండదు. నిద్రపోయే ముందు ఏదైనా పుస్తకం చూచుకుంటారు. ముభావంగా తనతో మాట్లాడుతారు. ఏవయినా ప్రశ్నలు వేస్తే జవాబు చెబుతారు. వారిని చూస్తూ వుంటే హాయిగా, జాలిగా ఉంటుంది. ఎంత శ్రమపడి వచ్చారు అనిపిస్తుంది ముందు. తరువాత మటుకు ఇంత శ్రమ ఎందుకు పడాలి? ఇంత శ్రమ లేకుండా కాలుమీద కాలు వేసుకుని కూర్చుంటే రోజులు గడిచిపోయే అవకాశం వున్నప్పుడు, ఎందుకు ఇట్లా కాలమంతా వృధాగా బయట గడపాలి- అని కోపం వస్తుంది.

ఉమ దుస్తులు మార్చుకుని పక్కమీదకు చేరింది.

దీపం ఆర్పేసి బెడ్‌లైట్ వేసుకుని అలమారులోనుంచి ఒక పుస్తకం తీసుకుంది. పడుకుని చదువుకుందుకు ప్రయత్నించింది. ఆయనను గురించిన ఆలోచనలన్నీ ఒక మూలకు నెట్టి పుస్తకంలో మునిగిపోవటానికి ప్రయత్నించింది. కేవలం కాలక్షేపం కోసం చదువుకునే పుస్తకం కనుక శ్రమ లేకుండా పేజీలు తిరిగిపోతున్నాయి.

కాంతమ్మ మళ్లీ గదిలోకి వచ్చింది.

ఉమ తన రాక గమనించిందని తెలుసుకున్నాక, ఒక మూల ఒదిగి కూర్చుంది.

కాంతమ్మకు ఏదో మాట్లాడాలని ఉంది. కాని అమ్మగారు చదువుకుంటున్నారు అని భయపడి ఊరుకుంది.

## 2

బయటకు వెళ్ళిన పని ముగించుకుని ఆఫీసుకు తిరుగు ముఖం పట్టేటప్పటికి సాయంత్రం అయిదు గంటలయింది; తిన్నగా తన గదిలోకి వెళ్లి కూర్చుని కాగితాలు తిరుగవేయ సాగాడు.

అరగంట గడిచింది.

ఇంటికి వెళ్లిపోదామనుకున్నాడు. అనుకోవడంతోటే ఇల్లు జ్ఞాపకం వచ్చింది.

పాపం, ఉమ తనను ఎప్పటి మాదిరిగానే పెందరాళే ఇంటికి రమ్మని చెప్పింది. ఇవాళ ఏదో స్పెషల్ పంక్షన్ ఉన్నదనీ, తను తప్పకుండా రావాలనీ గుర్తు చేసింది కూడా. కాదనలేక తల ఊపాడు అప్పుడు. ఇప్పుడు అసలు అందుకోసం వెళ్లే ఆలోచనే లేదు.

ఉమ తనకోసం ఎదురుచూచి వంటరిగా వెళ్లి ఉంటుంది. తను రాడని రూఢిగా తెలిసినా ఎదురు చూడడం మటుకు మానదు. తనలో అంత నమ్మకం ఏమిటో పాపం, ఉమకు.

ప్రసాద్ ఆఫీసు నుంచి బయలుదేరాడు.

ఎక్కడికని వెళ్లడం?

ఇవాల్టికి తన కార్యక్రమం అంతా ముగిసినట్లే. అనుకున్న పనులన్నీ సక్రమంగా పూర్తయినాయి. ఇక ఏం చేయాలి? ఒక్క క్షణం వృధాగా గడపడం ఇష్టం లేక తను రోజల్లా చేసిన సరిపోని పనులన్నీ ప్రతిరోజూ కేటాయించుకుంటాడు. అవన్నీ తన మీద, పగతీర్చుకున్నట్టుగా ఒక్కొక్కరోజు చక చక అయిపోయి, తనకు ఎదురు చూడని

విరామాన్ని కలిగిస్తూ ఉంటాయి. ఒక్కక్షణం కాళీగావుంటే, తనకు తోచదు. కాని అనుకున్న పనికంటె ఎక్కువగా చేయడం కూడా తన అభిమతానికి వ్యతిరేకమే.

ప్రసాద్ తిన్నగా ఇంటికి వెళ్లిపోయి విశ్రాంతి తీసుకుందామనుకున్నాడు. ఇంటికి వెళ్లవచ్చును. ఇంక ఉమ తన కోసం ఎదురు చూస్తూనే ఉంటూంది. తనను చూచిందంటే అందునా ఈ క్షణంలో ఆమెకు పంచప్రాణాలు లేచివచ్చినట్లు అవుతుంది. వెంటనే క్లబ్బుకు ప్రయాణం చేయిస్తుంది. సమయంలో ఇలా ఎదురు పడినాక కాదనడం కష్టం. అందుచేత ఇంటికి వెళ్లడం అనే పని కనీసం ఒక అరగంట సేపయినా వాయిదా వేస్తేగాని బాగుండదు అనిపించింది.

ఏమిటో చిన్నతనం నుంచి తన ప్రకృతి ఇలాగే ఉండిపోయింది. కులాసాగా కాలక్షేపం చేయాలనే ఇతరుల అభిప్రాయాలకు తన అభిప్రాయాలకూ ఎక్కడా సాపత్యం అగుపించదు. తన పద్ధతి తనకు అనుకూలంగానే ఉంది. కాకపోతే ఉమకు మటుకు ఇలా సాగడం ఇష్టం లేనట్లు అప్పుడప్పుడూ స్పష్టం అవుతూనే ఉంది.

విందులు వినోదాలు అనే పేరిట సోషల్ గాదరింగ్స్ జరగడం. అక్కడ పనిలేని పెద్దలందరూ చేరి ప్రపంచాన్ని తామంతా శాసిస్తున్నామన్న ధీమాతో చల్లగా కాలక్షేపం చేసి కడుపారా తిని తాగి కులాసాకోసం ఆడపిల్లల నృత్యమో ప్రత్యేక ప్రదర్శనలో తిలకించి అర్ధరాత్రి వేళ ఇళ్లకు దూరడం - ఇదంతా తల్చుకుంటూ ఉంటేనే ప్రసాద్‌కు తీరని అసహనం వేస్తుంది. నిక్షేపంలాంటి కాలాన్ని దుర్వినియోగం చేయడం కాకపోతే ఏమిటి ఇదంతా?

అందుకనే తను ఇటువంటి వాటికి వీలయినంత దూరంగా ఉంటూ వచ్చాడు. అది తన కాలాన్ని ఆక్రమించుకుని తన మనస్సును ఆకట్టుకోకుండా జాగ్రత్త పడుతూ వచ్చాడు.

ఎటు పోవటానికి ప్రత్యేకించి ఏమీ ఉద్దేశ్యం లేకుండా కారును ముందుకు పోనిస్తున్నాడు, నెమ్మదిగా దారిలో ఎవరయినా కనిపిస్తే బాగుండును- కాస్త కాలక్షేపం అవుతుంది అనుకున్నాడు. కాని కావాలనుకున్నప్పుడల్లా ఇట్లే కనిపిస్తారా స్నేహితులు? వాళ్లు తమ తమ కార్యకలాపాలలో మునిగిపోయి సతమతమవుతూ ఉంటారుగాని ఇలా ఏమీ తోచక కొట్టుమిట్టాడుతున్న తనకోసం వెదుకుతూ ఎదురుగా వస్తారు కనకనా?

ప్రసాద్- నింపాదిగా కారునడుపుకుంటూ రోడ్డుమీద వెడుతున్న జనాన్ని చూస్తున్నాడు. ఈ మహానగరంలో పేవ్‌మెంట్లమీద ఏ క్షణంలో చూచినా జనం

ప్రవహిస్తూ వుంటారు. అందరికీ ఏదో హడావుడి. ఏదో తొందర. ఎన్నో పనులు బుజాన వేసుకుని జనం పరుగులు తీస్తూ ఉంటారు. ఒకరికీ నిలబడి 'ఏమిటి ఈ జనం? ఏమిటి ఈ నడక?' అని ప్రశ్నించుకునే సమయం ఉండదు. ఒక రకంగా చూస్తే ఈ జనం నడవడం లేదేమో అనిపిస్తుంది. రోడ్లే వీళ్ల బరువుకు కుంగిపోయి దిక్కున్నచోట చెప్పుకోవటానికి పారిపోతున్నాయేమో ననిపిస్తుంది.

ఈ ఆలోచన రావడంతోటే ప్రసాద్‌కు నవ్వు వచ్చింది. జనాన్ని చూచి కాదు- తన ఆలోచనకే.

ఉన్నట్టుండి అతని దృష్టి తన కారు పక్కగా వెడుతున్న మనిషి మీద పడింది.

ఎవరతను?

ఎక్కడో చూచినట్లు ఉందే- అనుకున్నాడు.

బాగా పరిచయం అయిన ముఖం అనిపిస్తోంది.

రోజూ వేలకొద్దీ ముఖాలు చూస్తూ వుంటాం. ఎన్నని గుర్తు పెట్టుకోవడం?... కాదు! ఈ మనిషి తనకు బాగా పరిచయం అయినవాడు అనిపించింది.

అతను తనను చూడనేలేదు.

చూస్తే అతనే పలుకరించేవాడేమో?

ఈసరికి ఆ మనిషి కాస్తా దాటిపోయినాడు.

ప్రసాద్ రేర్ మిర్రర్‌లో నుంచి అతన్ని గమనించాడు. ఆ నడక కూడా తనకు సుపరిచితమేననిపించింది. ఈ పరిచయం అయిన మనిషిని ఇప్పుడు వదిలేస్తే లాభం లేదనిపించింది. కారు వెనక్కి నడిపించాడు.

అతను మాత్రం తన దారిన తాను నడుచుకుంటూ తల వంచుకు వెళ్లిపోతున్నాడు.

ప్రసాద్ అతనికి పక్కన కారు ఆపాడు. తన పక్కన కారు ఆపిన సంగతి కూడా ఆ మనిషి గమనించినట్లు లేదు. చేతిలో 'పేపరు' ఊపుకుంటూ తన దారిన తాను నడుచుకు పోతున్నాడు.

ప్రసాద్ కారు రోడ్డు వార ఆపి తనూ దిగివచ్చాడు.

'ఏమండీ మిమ్మల్నే' అన్నాడు.

కాని ఆ మనిషి వెనక్కు తిరిగి చూడనే లేదు.

ప్రసాద్ మళ్లీ పిలిచాడు. రెండడుగులు ముందుకు వేసి అతని చేతిని తట్టాడు. ఈమారు అతను ప్రసాద్ వంక చూచాడు. ప్రసాద్ 'మిమ్మల్నే పిలుస్తున్నాను' అన్నాడు.

ఆ మనిషి 'ఎవరు నువ్వు?' అని అడగలేదు గాని ఆ ప్రశ్న వేసినట్లే ముఖం పెట్టాడు.

'నా పేరు ప్రసాద్, మనం ఇద్దరం పూర్వ పరిచితులం. మరచిపోయినారా?' అనడిగాడు ప్రసాద్, చొరవచేసి.

నిజానికి ఈ మాటలు అతని నోటివెంట అప్రయత్నంగా వచ్చేశాయి. అతను ప్రసాద్‌ను ఎగాదిగా చూచాడు.

రెండు మూడు క్షణాలు గడిచాయి.

ఆ కొత్త మనిషి ముఖంలో ఒక రకమైన 'కాంతి' ప్రవేశించింది. పాత జ్ఞాపకాలు స్ఫురణకు తెచ్చుకుంటున్న ప్రయత్నం - అది ఫలించిన తీరు అతని ముఖంలో వినూత్నమయిన వికాసాన్ని కలుగచేశాయి. ఈ వికాసానికి నిలదొక్కుకోలేక అతను ప్రసాద్ చేతులను తన చేతుల్లోనికి తీసుకొని అతన్ని దగ్గరకు లాక్కున్నాడు. కౌగిలించుకున్నాడు.

'హలో ప్రసాద్ గుర్తించలేకపోయినాను క్షమించు'

ఇద్దరి ప్రాణమూ ఒక్కమారుగా కుదుట పడినట్లు అయింది.

'అకస్మాత్తుగా చూచాను. చూడగానే గుర్తించాను. కారు ఆపి మీ వెనకాలే వచ్చేశాను' అన్నాడు ప్రసాద్. స్నేహితుడి చేయి ఇంక వదలకుండానే.

'మనం విడిపోయి చాలాకాలం అయింది. అందుకని వెంటనే గుర్తు రాలేదు' అన్నాడు ఆ మిత్రుడు.

'మరేం ఫరవాలేదు కాంతారావ్ - రా - వెళ్లి కారులో కూచుని మాట్లాడుకుందాం' అంటూ ప్రసాద్ అతన్ని తన కారు దగ్గరకు నడిపించుకు వెళ్లాడు.

కాంతారావు క్షణంపాటు ఆలోచించాడు.

'ఎక్కడికి వెడదాం?' అనడిగాడు గడియారం వంక చూసుకుంటూ.

'ఏం, ఏదైనా ఎంగేజ్‌మెంట్ ఉందా?'

'ఏం లేదు, ఇంటికే వెడుతున్నాను. తొందరేం లేదు'.

'అలా ఎక్కడయినా ఏకాంతంగా ఉండేచోట కాస్సేపు కూచుందాం. మనం కలుసుకుని పదేళ్లు దాటిపోయింది తెలుసా?' అన్నాడు ప్రసాద్.

ఇద్దరూ కారులో కూర్చున్నారు.

కారు ముందుకు నడిచింది.

దారిలో ఇద్దర్రూ మౌనంగానే ఉండిపోయారు.

నిజానికి ప్రసాద్‌కు మాట్లాడాలని వుంది. కాని ఏం మాట్లాడాలో తెలియడం లేదు.

చిన్నతనపు స్నేహితులు- పదేళ్ల తరువాత ఇవాళ అకస్మాత్తుగా రోడ్డు మీద కలుసుకున్నారు. ఇద్దరి మనసులలోను ఏవేవో వాళ్ల స్నేహితానికి, వ్యక్తిత్వానికి సంబంధించిన విషయాలే మెదులుతూ వున్నాయి. అప్పటి సంగతులేవో నెమరు తెచ్చుకుంటున్నారు.

ప్రసాద్, కాంతారావు కాలేజీలో స్నేహితులు. అయిదు సంవత్సరాలు కలిసి చదువుకున్నారు. ఇద్దరూ ఒకేమారు బి.ఏ. మొదటి తరగతిలో 'పాసు' అయినారు. తరువాత ఇద్దరూ ఎవరి దారిన వారు వెళ్లారు. ఒకటో రెండో ఉత్తరాలు వ్రాసుకున్నారు. అంతే. కలిసి వున్నప్పుడు ఎంత స్నేహమో విడివడిన తరువాత ఆ స్నేహమంతా ఏమయిందో ఆ భగవంతుడికే తెలియాలి.

అసలు స్నేహాలు అనేవి ఎంత విచిత్రంగా ఏర్పడతాయో అంత విచిత్రంగానూ మరుగుపడతాయి.

మనిషి యెక్కడికక్కడ వర్తమానంతో, చుట్టూవున్న వాతావరణంతో సర్దుకు పోయే ప్రయత్నాలలో వెనుకటి సంగతులనూ మనుష్యులనూ ఇట్టే మరచిపోతాడు. గుర్తు పెట్టుకోవలసిన అవసరము, అవకాశము ఉంటే తప్ప స్మరించుకోడు.

హాస్టలులో ఒకే గది అవడంవల్ల చదువులో నిత్య సంబంధం ఉండడం వల్ల ఇద్దరి స్నేహమూ ఆ అయిదు సంవత్సరాలు దాని ఉనికే దానికి తెలియవలసినంత అవసరం లేకుండా గడిచిపోయింది. ఒక్కొక్క దశలో ఇటువంటి స్నేహితాలు మరింత గాఢంగా ఏర్పడటానికీ, జీవితాంతం వాటి ప్రభావం ఆ వ్యక్తుల మీద పడదానికే అవకాశం ఉంది. అయితే ఆ అవకాశానికి అవకాశం ఏర్పడడమే అరుదు.

కారు ఆగింది.

ఇద్దరూ దిగారు. ఒంటరి చోటు చూచుకుని కూర్చున్నారు.

ఈ మారు కాంతారావు సంభాషణ ప్రారంభం చేశాడు.

'మన స్నేహం మధ్యలో ఆగిపోవటానికి ఎవరు కారణం?' అనడిగాడు.

బహుశా ఈ విషయాన్ని గురించే ఇద్దరూ తమలో తాము ఆలోచించుకున్నారు. అందుకనే ప్రసాద్‌కు ఈ ప్రశ్న కొత్తగా అనిపించలేదు. వెంటనే సమాధానం చెప్పాడు 'ఇద్దరమూను!'

ఇక ఎవరికి వారు తమ తరఫున సంజాయిషీ చెప్పుకోవలసి వచ్చింది. పోతే, వచ్చిన చిక్కల్లా ఏమిటంటే ఎవరికీ బలమయిన కారణం లేదు. అంతకంటే మరింకో కారణం లేదు.

'చదువుకునే రోజులలో మనం ఎంతో స్నేహంగా ఉండేవాళ్లం గదా! బి.ఏ. అయిన తరువాత ఎవరిదారిన వాళ్లం పై చదువులకు వెళ్ళాం అనుకో. అంత మాత్రాన ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా మన స్నేహాన్ని నిలుపుకోకూడదని ఏమిటి? అలా ఎందుకు చేయలేదు మనం?' అనడిగాడు ప్రసాద్.

'ఇప్పుడీ ప్రశ్న అడగటానికీ వినడానికీ బాగానే ఉంటుందిగాని జవాబు మటుకు ఏమీ తోచదు. బొత్తిగా అశ్రద్ధ కారణం అయివుంటుంది' అన్నాడు కాంతారావు.

'పోనీలే, ఇప్పటికయినా తిరిగి కలుసుకున్నాం'

'స్నేహాన్ని వెనక్కు నెట్టాం గనుక మనం కూడా ఇక్కడ నుంచి వెనక్కు వెళ్లి పరిస్థితిని సమాలోచించుకుందాం' అన్నాడు.

'నేను ఇర్రిగేషన్ డిప్యూటి చీఫ్ ఇంజనీయరుగా వున్నాను. రెండేళ్ల క్రితం ఇక్కడకు బదిలీ అయింది. రాయలసీమలో కొన్నాళ్లు, విశాఖ ప్రాంతంలో కొన్నాళ్లు ఉన్నాను అంతకుముందు'.

'అలాగా! నేనిక్కడ అయిదేళ్ల నుంచి ఉన్నాను. ప్రస్తుతం... ఇంగ్లీషు దినపత్రికలో అసిస్టెంట్ ఎడిటర్‌గా వున్నాను' అన్నాడు కాంతారావు.

'రైట్, అయితే ఇదివరకు మనం అనుకుంటూ వచ్చిన కోరికలు చాలా వరకు నిజం అయినాయన్నమాట!'

'మనం అనుకుంటూ ఉండిన మాటలు గుర్తుకు వస్తే అప్పుడు ఎంత అజ్ఞానులం అనిపిస్తూ వుంటూంది నాకు'.

'ఎందుకని?'

'జీవితంలో ఇది కావాలి, అది కావాలి అన్న కోరికలను మనం చిన్నతనం నుంచే పెంచుకుంటూ రావడం మంచిపని కాదుగా! తీరా అవి అవకపోతే మనం ఎంత నిరాశపడవలసి వస్తుంది!'

'అయితే మటుకు ఏమీ అనుకోకుండా ఎట్లా ఉంటాం? ఏదో లక్ష్యం అనేది జీవితాన్ని గైడ్ చేయాలి గదా!'

'ఏమో ప్రసాద్, నాకు అటువంటి నమ్మకాలు గతించాయి. ఒకప్పుడు ఏమయినా మొండి ధైర్యం వుందేమోగాని ఇప్పుడు నాకు ఏదీ సుకృతంగా కనిపించడం లేదు. ఏం చేసినా, మనిషికి కావలసిందేమిటో అర్థం కావడం లేదు'.

'మొత్తంమీద జర్నలిస్టుకు కావలసిన వేదాంత ధోరణి సంపాదించినట్టున్నావు. చదువుకునే రోజులలో నువ్వు జీవితాన్ని డిక్టేట్ చేస్తానంటూ ఉండేవాడివి గుర్తుందా?'

'గుర్తు లేకేం ఉంది. కాకపోతే దాన్ని నేను డిక్టేట్ చేయలేకపోగా అది కూడా నన్ను అందరికి మల్లేనే డిక్టేట్ చేయడం మానివేసింది. ఇంకేం చేయను?'

'అలా ఎందుకయింది?'

'అయిందో లేదో నాకు మాత్రం అట్టా అనిపిస్తోంది'.

స్నేహితులు ఇలాగే కొంతసేపు మాట్లాడుకున్నారు. తమతో ప్రారంభం అయిన ఈ సంభాషణ వాళ్లకు తెలియకుండానే లోకాభిరామాయణంలోనికి దిగింది. ఇద్దరూ ప్రపంచ పరిస్థితిని గురించి కొంత సేపు చర్చించుకున్నారు. ప్రపంచంలో నాలుగు మూలల ఏమేం జరుగుతున్నదీ దుర్బిణీయంత్రంలో చూస్తున్నట్లుగా కబుర్లు చెప్పుకున్నారు. కాంతారావు జర్నలిస్ట్ కదా ప్రపంచం ఎటువైపు నడుస్తున్నదీ అతనికి బాగా తెలుసును. ప్రసాద్ అతను చెబుతున్నవన్నీ వివరంగా వింటూ కూర్చున్నాడు. అంతర్జాతీయ పరిస్థితి చర్చించిన మీదట వాళ్లు స్వదేశం మీదికి ధోరణి మళ్లించారు. చదువుకునే రోజులలో ఉన్న స్వాతంత్ర్య పోరాటం గొడవలు గుర్తుకు తెచ్చుకున్నారు. స్వాతంత్ర్యం వచ్చాక దేశంలో వచ్చిన మార్పులు, ప్రజలలో వచ్చిన చైతన్యం, జీవితాలలో తటస్థపడిన ఒడుదుడుకులు అన్నీ తలపోసుకున్నారు. కాంతారావు మొత్తం మీద ఆ మార్పులన్నీ సహజంగా లేవంటాడు. ఏదో తెచ్చిపెట్టుకున్న మర్యాదలాగ ఉన్నాయి. అందుకనే ఇవంటే తనకు భయం అని చెప్పాడు. అయినా ఏంలాభం? ఈ ప్రపంచంలో బతుకుతూ ఈ ప్రపంచాన్ని కాదనగలమా? అని ఏదో విధంగా సర్దుకుపోయి బతుకుతున్నానంటాడు.

కాంతారావు చెబుతున్నదంతా ప్రసాద్ వింటున్నాడు. కాని అతనికి అన్నీ అర్థం అవుతున్నట్లు అనిపించలేదు. ఏమిటో గొడవగా ఉంది. గందరగోళంగా వుంది. మధ్యలో అసలు ఈ కాంతారావు ఏ విషయం మీద మాట్లాడుతున్నాడూ అని

అనుమానం కూడా వచ్చింది. అయినా తమాయించుకుని మధ్యలో ఏమీ ప్రశ్నలు వేయకుండా వింటూ కూర్చున్నాడు. అంతా చెప్పి చెప్పి కాంతారావు ఇలా అన్నాడు. 'ఏమిటో మాట్లాడి నిన్ను బోర్ చేస్తున్నట్లున్నాను. ఏమిటో జీవితం మీద విశ్వాసం పోయిన మనిషి ఇంతకంటే ఏం చేస్తాడులే'.

ఈ ఒక్క ముక్కతో ప్రసాద్‌కు కాంతారావు ధోరణి అంతా అవగాహన అయినట్లయింది.

'నీకా కాంతారావ్? జీవితం మీద విశ్వాసం పోయిందా? అంటే?' అని అడిగాడు.

'దానికింకా వ్యాఖ్యానం ఎందుకు? నాకు దేనిమీద నమ్మకం లేదు. ఏదీ నన్ను నమ్మించలేకపోయింది. ఇన్నాళ్ళు నా జీవితంలోనూ' అన్నాడు కాంతారావు.

'ఒక విధమయిన బాధలో పడినవాళ్లు ఇలాగే వేదాంత ధోరణి అలవరచు కుంటారు. కాని ఇదంతా నిజమనే విశ్వాసం అయినా నీకు ఉందా?'

కాంతారావుకు యీ ప్రశ్న అర్థం కాలేదు.

ఆ సంగతే చెప్పాడు ఏమీ సంశయించకుండా.

'నీకు జీవితం మీద విశ్వాసం పోయిందన్నావు' బాగానే వుంది. అంతవరకూ – కాని విశ్వాసం మీదనయినా నీకు విశ్వాసం ఉన్నదా అని అడుగుతున్నాను'.

కాంతారావు చిక్కుల్లో పడ్డాడు. ప్రశ్న అయితే బాగానే ఉంది కాని జవాబు ఏం చెప్పేట్లు?

జీవితంలో ఏ విశ్వాసమూ దొరకక ఎక్కడా విశ్రాంతి విరామం చిక్కక ఇదంతా మిథ్య. ఎవరిదో సృష్టి. – ఇక్కడ మనకు మిగిలేది ఏమీలేదు అన్న భావం మనసులో బాగా నాటుకుపోయిన తరువాత ఈ భావం యొక్క పునాది ఎంత బలంగా ఉంది, గాలి వాన వస్తే పడిపోదు గదా అన్న ప్రశ్న ఇంతవరకు ఏ మిత్రుడూ అతనికి 'పోజ్' చేయలేదు. ఇప్పుడు అందుకనే సందిగ్ధంలో పడ్డాడు కాంతారావు.

'ఇప్పటివరకు ఆ విశ్వాసమే నన్ను నడిపించింది. దాన్ని కాదనుకోవాల్సిన సన్నివేశం నాకు ఎదురవలేదు' అన్నాడు చివరకు.

'అదే నేను చెప్పబోతున్నాను. కొన్ని కొన్ని పరిస్థితులలో ఇమిడిపోయి మనం మనస్సును మనకు కావలసిన విధంగా మలుచుకుంటూ ఉంటాం. అంతవరకు ఏదీ ఏమీలేదు. కాని ఈ పని అందరూ చేస్తూనే వున్నారు. అక్కడే వస్తోంది

అంతర్యుద్ధాలకు అవకాశం. ఎవడి మటుకు వాడు విడిగా బతకడం అయితే ప్రజలలో ఎవరికీ ఇంత బాధ ఉండదు. వెధవది మానవుడు సంఘజీవి అన్నారు గదా తను బతకాలి. తన పక్కవాళ్లను బతకనివ్వాలి. ఈ రెండో షరతు దగ్గరే ఎవరికి ఏ గందరగోళం తటస్థపడినా! నీ మటుకు నీవు అవిశ్వాసంలోనే విశ్వాసం కలిగించుకుని బతుకుతున్నానంటున్నావు. అంటే ఈ అవిశ్వాసం ఎన్నాళ్లు ఉంటుంది?' నీ చుట్టూ నువ్వు కట్టుకున్న గూడు నువ్వు ఎన్నాళ్లు పోషించుకోగలిగితే అన్నాళ్లు ఉంటుంది. అయితే నీవు దీనిని ఎల్లకాలమూ పోషించగలవా? ఎప్పుడో పక్కవాళ్లను చూచి నీకు చిరాకు ఎత్తుకొస్తుంది. అసూయ కలుగుతుంది. కోపం వస్తుంది. వాళ్లు నీకు కావలసిన పద్ధతిలో, కనీసం నువ్వు అవుననుకునే పద్ధతిలో ప్రవర్తించడం లేదంటే, నువ్వు కసురుకుంటావు. అప్పుడు నీ చుట్టూ వున్న గూడు చెదిరిపోతుంది. ఏ విశ్వాసమయినా నిన్ను ముందుకు నడిపించగలదేమో గాని ఆ విశ్వాసం కనీసం నిన్ను వున్నచోట నయినా ఉండనీయదు. అంటే విధిగా వెనక్కు లాక్కుపోతుంది. నీకే తెలియనంత దూరం వెళ్లిపోతావు. అంతకంటే దారుణం ఇంకేమైనా వుందా?' అన్నాడు ప్రసాద్.

'సిద్ధాంతరీత్యా నీవు చెబుతూ ఉన్నది మేమయినా నిలుస్తే నిలుస్తుందేమో కాని నిజ జీవితంలో మటుకు ఎందుకూ కాదు. ఏమంటే, ప్రపంచంలో అనేక విశ్వాసాలు వున్నాయి. అనేక మతాలు ఉన్నాయి, ధర్మసంస్థలు ఉన్నాయి. శ్రీరంగ నీతులు చెప్పే వేదాంతులు అనేకులు ఉన్నారు. మరి దేశం ఇలా అఘోరిస్తోందేం? కనుక ఇవన్నీ ఏమీ కావు. మనిషిని మనిషి నడిపించడం అనే రోజులు పోయినాయి. ఇప్పుడు ఎవడికి వాడు చేతనయిన పని చేసుకుంటూ హాయిగా ఉండడం ఒక్కటే మార్గం. దాదాపు సన్యసించినట్లుగా సంసారం సాగించాలి' అన్నాడు కాంతారావు.

'నీ వాదం తమాషాగానే ఉంది, ఎంతవరకు నిజమో నాకయితే తెలియడం లేదుగాని, పోనీలే ఎవరికయినా ఏదో విశ్వాసం కూడా చొక్కాలు మార్చినంత తేలికగా మార్చివేస్తేనే మనిషికి కాస్త శాంతీ లేకుండా పోతుంది'.

'శాంతి-సహనం-ఇలాంటి మాటలన్నీ పుస్తకాలలోను, పత్రికలలోను వ్రాసుకుందుకు పనికివస్తాయిగాని, నిత్య జీవితంలో ఎక్కడా పొసగడం లేదు. మనిషి ఆశలు, ఆశయాలు ఒక దిక్కుగా ప్రయాణం చేస్తూ ఉంటే అతని పరిస్థితులు గ్రహచారం మరో దిక్కుగా ప్రయాణం చేస్తున్నాయి'.

'అవును కాంతారావ్. జీవితంలో కాన్‌ఫ్లిక్ట్ అంటే అదే గదా! ఈ రెంటినీ సమన్వయం చేసుకుని మనిషి ఎలా బతుకుతున్నాడు అన్నదానిమీదే అతని సంస్కారం ఆధారపడి ఉంటుంది.

'అదిగో, అప్పుడే సంస్కారం అని ఒక పెద్దమాట తెచ్చి పడేశావు. మనం చేసే వెధవపనులకు పెద్ద పెద్ద పేర్లు తగిలించుకుంటేగాని మనకు తృప్తి లేకుండా పోతోంది. ఇందాక నువ్వు అన్నట్లు సంస్కారం అనేది ఆ మనిషికి ఒక్కడికీ సంబంధించినది కాదు గదా! ఒక్కొక్క మనిషికే అనేక రకాలుగా అనేక మార్గాలుగా ఈ సంస్కారం అనేది వచ్చిపడుతూ ఉంటుంది. ఇన్ని దిక్కులుగా వస్తున్న ఈ సంస్కారాన్ని సమన్వయం చేసుకునేసరికి తల ప్రాణం తోకకు వస్తోంది. ఇక వీటన్నిటినీ జీవితంలో వచ్చే గొడవలతో కలిపి లాభనష్టాలు బేరీజు వేసి మంచివి కూజాలో పట్టి చల్లబరచి దప్పిక అయినప్పుడు అవకాశం అంటూ ఎక్కడ మిగిలి ఏడ్చింది గనుక?'

'అయితే మనిషి అన్నవాడు ఏం చేస్తున్నాడంటావు?'

'అదే! ఏం చేస్తున్నానన్న విషయమే ఆలోచించకుండా ఏదో గుడ్డిగా చేసుకుంటూ పోతున్నాడు. అంతే!'

'అవతలివాడు గుడ్డిగా వున్నాడని నీకు నిర్ధారణ ఎట్లా? ఒక వేళ మన గుడ్డితనం వల్ల వాడి అంధత్వాన్ని కేవలం ఊహించుకుంటూ నడుస్తున్నామేమో? ఆ విషయం ఆలోచించావా?'

'ఆహా! ఏది వెలుగు, ఏది చీకటి అనేది అంచనా వేయడంలో అంత ఘోరపాటు పడకపోవచ్చును. కాని అందరూ అలాగే ఆలోచిస్తూ వుంటే అప్పుడు తరుణోపాయం ఏమిటి? అదే నేను అడిగేది?'

'నేను అనేది అదే! చివరకు ఇద్దరమూ ఒకే మాటకు వచ్చాం, చూచావా! మనిషి అన్నవాడు తనకు తెలియకుండానే ఏదో చేసుకుపోతున్నాడు. గతి తనను ఎక్కడికి తీసుకువెడితే అక్కడకు వెళ్లడానికి సిద్ధమయిపోయి ఒకచోట చేతులు కట్టుకుని కూర్చున్నాడు, అంతే'

కాంతారావు చెప్పడం అయిన తరువాత ప్రసాద్ మరింత అయోమయంలో పడిపోయినట్లు ఫీలయ్యాడు.

ఇంతకూ కాంతారావు చెప్పింది ఏమిటి?

తను మొదట కాదని తరువాత అతనితో అంగీకరించింది ఏమిటి? ప్రసాద్‌కు ఈ రెండూ అర్థం కాలేదు. జీవితంలో విశ్వాసం ఉండాలా అక్కర్లేదా అన్న విషయం మీద తనకు తోచిన ముక్కలు రెండు చెప్పాడు. ఇవైనా అప్పటికప్పుడు అన్నవేగాని ఏదో నిరంతర మథన అనంతరం తాను వెలువరించుకున్న మథన సత్యాలు కావు. అసలు ఇటువంటి గొడవలన్నీ ఇప్పుడు ఏదో అవతలి స్నేహితుడు హుషారుగా చెప్పుకుపోతున్నాడు గనుక వింటూ కూర్చున్నాడు.

'అబ్బ' అప్పుడే తొమ్మిది అయింది. ఇక ఇంటికి వెడదామా?' అన్నాడు ప్రసాద్.

స్నేహితులు ఇద్దరూ లేచారు.

'చిన్ననాటి స్నేహితులం అనుకోకుండా కలుసుకున్నాం. ఈ స్నేహం కొన్నాళ్ళు వాయిదా పడకుండా ఇలాగే కొనసాగాలని ఉంది. ఏమంటావు?' అన్నాడు ప్రసాద్.

'అంతకంటేనా, ఇప్పుడు ఒక ఊళ్లోనే ఉన్నాంగనుక అందుకేమీ అభ్యంతరం ఉండదు'.

'సాధ్యమయినంతవరకు రోజూ కలుసుకుంటూ ఉందాం. రా, నిన్ను మీ ఇంటిదగ్గర డ్రాప్ చేసి వెడతాను' అన్నాడు ప్రసాద్.

'ఎందుకంత శ్రమ. ఇద్దరి మార్గమూ కలిసేంతవరకూ తీసుకువెళ్లు చాలు. అక్కడ నుంచి నా దారిన నేను వెడతాను'.

'రేపు ఎక్కడ ఎలా కలుసుకుందాం?' అన్నాడు ప్రసాద్ కారు నడుపుతూ.

'నాకు రేపు పగలు షిఫ్టు సాయంత్రం నాలుగున్నరకు నా పని అయిపోతుంది. తిన్నగా మీ ఆఫీసుకు రానా?'

'ఒద్దు. ఎక్కడ వుంటానో చెప్పలేను. నాలుగున్నరకి నేనే మీ ఆఫీసుకు వస్తాను. కాస్త ఆలస్యం అయినా కనిపెట్టుకు వుండు' అన్నాడు కాంతారావు.

'అలాగే'

ఇంతలో కాంతారావు దిగిపోవలసిన సెంటర్ వచ్చింది.

'కారు ఆపు. నేను ఇక్కడ దిగుతాను'.

ప్రసాద్ కారు ఆపాడు.

ఇద్దరూ గుడ్‌బై చెప్పుకున్నారు. మళ్లీ రేపే సాయంకాలం కలుసుకుందామని విడిపోయారు.

ప్రసాద్ ఒక్కడూ కారు నడుపుకుంటూ ఆలోచనలలో పడ్డాడు.

ఈ రోజు నిజంగా ఎంత విచిత్రమయినది! ఒక్కొక్కరోజు అలాంటిది అవుతుంది కాబోలు.

కాంతారావు అనుకోకుండా కనిపించడం నిజంగా ఒక విశేషమే అనిపించింది ప్రసాద్‌కు.

ఏమిటో అన్నీ అనుకోవడమే గాని ఏది అలా జరుగుతుంది?

ఎప్పుడో ఒకసారి అనుకుంటాం ఈ స్నేహం కలకాలం నిలవాలని.

కాని నిజంగా అలా జరగదు.

ఒక్కొక్క వాతావరణానికి ఒక్కోరకంగా మారిపోతూ ఎక్కడికక్కడ పరిస్థితులతో అతుక్కుపోతూ ఉండడంతో పాత స్నేహాలు మరుగుపడిపోతాయి. ఏవో కొత్తవి తటస్థిస్తూ ఉంటాయి. పాత వాటిని కాదని మనం మరచిపోనక్కర్లేదు. ఎంత ప్రయత్నం చేసి జ్ఞాపకం ఉంచుకుందామనుకున్నా అవి నల్లతెర ఒకటే ముసుగుగా కప్పినట్లు కనిపించకుండా కంటికి ఆనకుండా పోతాయి. అయితే ఇలాంటి పాత స్నేహాలను పునఃస్థాపితం చేసుకునేటప్పుడు ఎంత సంతోషంగా ఉంటుంది! వెనకటి స్థితిలో ఆ స్నేహం ఎంత గాఢమయినదయితే ఇప్పుడు అంత సంతోషంగానూ ఉంటుంది. ఇదొక్కటే కొలతబద్ద, మరేం కాదు. ఈ నల్లని తెర తొలగిపోయినట్లు, మనసును ఆవరించివున్న మెరుపు తెరలు విడిపోయినట్లు, ఒక్క మధురాతి మధురమైన స్మృతి కలుగుతుంది! ఈ స్మృతుల ఆనందం అనుభవించిన క్షణాలు గుర్తుకు తెచ్చుకుంటూ కొన్ని యుగాలపాటు జీవితం వెళ్లబుచ్చవచ్చునని అనిపించింది ప్రసాద్‌కు.

కాంతారావు మొదటి నుంచి కూడా విచిత్రమయిన మనిషి.

అయితే ఈ 'విచిత్రం' ఏమిటో ప్రసాద్‌కు ఎప్పుడూ ఇతమిత్థమని కనిపించేది కాదు.

ఇదివరకూ అంతే! ఇప్పుడూ అంతే.

కాని అతనేదో మారిపోయినట్లు కనిపిస్తున్నాడు.

జీవితంలో విశ్వాసం, అవిశ్వాసం ఇలాంటి వెర్రివేదాంతం బుర్రలో ప్రవేశ పెట్టుకుని ఎదురుగా కనిపిస్తున్నదంతా 'మిథ్య' అనీ ఏదో మనసులో దోబూచులాడుతూ కవిత్వం పుస్తకాలలో ఉండే మధుర భావాల కోసం పరితపిస్తూ ఎంతో మథన పడుతున్నట్లు కనిపిస్తున్నాడు. ఇదంతా ఏమిటి అనిపించింది ప్రసాద్‌కు.

కాంతారావు చుట్టూ ఏదో అశాంతి ఆవరించి ఉన్నట్లుంది. ఎక్కడిది ఈ అశాంతి కేవలం ఊహాజనితమే అయివుండాలి. ఆలోచనలు ఎక్కువయి, పుస్తకాలు విపరీతంగా చదవడం వల్ల, వృత్తి ధర్మంతో పూర్తిగా కలిసిపోలేక ఇటువంటి మానసిక వికారాలు బయలుదేరుతాయేమో!

ఇలా ఆలోచించుకుంటూ ప్రసాద్ ఇంటికి చేరుకున్నాడు. కారు సరాసరి గారేజీలో నిలిపి మెట్ల మీదుగా మేడమీదకు వెళ్లాడు. హాయిగా భోజనం చేసి నిద్రపోతే రేపు ఉదయం వరకూ ఇబ్బంది ఉండదు.

ప్రసాద్ మెట్లు ఎక్కుతున్న అలికిడి ఉమ గమనిస్తూనే ఉంది.

వస్తున్నవాడు ప్రసాదేనని నమ్మకంగా అనిపించాక 'అమ్మయ్య' అనుకుంది.

ప్రసాద్ తిన్నగా గదిలోనికి వచ్చాడు.

ఉమ వంక చూచి చిన్నగా నవ్వాడు.

ఆమె నుంచి అటువంటి మందహాసాన్నే ఎదురు చూచాడు గాని ఉమ గంభీరంగా కూర్చుండి ఊరుకుంది.

'ఇంటికి రావడం చాలా ఆలస్యం అయిపోయింది ఉమా! అక్కడికీ తొందరగా వద్దామని ప్రయత్నం చేశాను. ఫ్చ్ కుదరలేదు' అన్నాడు ప్రసాద్ ఆమె గాంభీర్యానికి, మౌనానికి కారణం ఊహించుకుని.

ఈ మాటతోనయినా ఉమ చల్లబడినట్లు లేదు. ఆమె నుంచి ఏమీ బదులు రాకపోవడంతో ప్రసాద్‌కు మరింత భయం అనిపించింది.

ప్రసాద్ ఆలోచించి ఇలా అన్నాడు-

'ఏ ఉమా! అలా ఉన్నావేం సాయంత్రం పార్టీకి వెళ్లివచ్చావా? బాగా జరిగిందా? నేను సరాసరి అక్కడికయినా వస్తాననుకున్నాను. ఏదీ సెక్రటరీ వదలి పెట్టందే?'

'ఎందుకు లేనిపోని కారణాలు కల్పించి చెబుతారు. మీరు వెళ్లిపోవాలంటే సెక్రటరీ కాదు కూడదని అడ్డం నిలుచుంటాడా ఏమిటి? పార్టీకి రావడం ఇష్టం లేదని చెప్పండి. ఈ ఇచ్చకాలన్నీ యెందుకు?'

ప్రసాద్ దుస్తులు మార్చుకోవడం అయింది.

ఉమకు ఎదురుగా ఒక కుర్చీలో కూలబడుతూ 'నా మాట నమ్మవా ఉమా! పనివేళ అబద్ధం కల్పించి ఎందుకు చెబుతాను? నా ముఖం చూడు, నేను నిజంగా చెబుతున్నానో అబద్ధం చెబుతున్నానో నీకు ఇట్టే తెలిసిపోతుంది' అన్నాడు.

నేను 'లై' డిటెక్టర్‌ని అనుకుంది. ఉమ మనసులో కాని అతని చమత్కారానికి నవ్వకుండా ఉండలేకపోయింది. ఒక్కమారుగా తల పైకెత్తి తృప్తిగా నవ్వి 'పదండి. ఇకనైనా భోజనం చేద్దాం' అంటూ లేచింది.

'నీవు కూడా ఇంకా భోజనం చేయలేదా ఉమా!' అంటూ ప్రసాద్ ఆమెను అనుసరించాడు.

విధి సమాహారం అయింది ఆమెకు ఆ క్షణంలో.

❖